సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం, 9, సెప్టెంబర్, 2024



## కడప, నెల్లూరు జట్లు విజయం

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. -8లో



## ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు

కడప నగరపాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. నగరపాలక టౌన్‌ప్లానింగ్ విభాగం చేష్టలుడిగి చూస్తోంది. -8లో

గరిష్టం/కనిష్టం
33.6/25.2

## వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.2 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### నేటి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'రద్దు

కడప అర్బన్: వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం'ను రద్దు చేసినట్లు ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది వినాయక నిమజ్జన బందోబస్తు విధుల్లో నిమగ్నమై ఉంటారని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

### నేటి నుంచి పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

కడప అగ్రికల్చర్: కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నుంచి 5 రోజులపాటు పుట్టగొడుగుల పెంపకంపై నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్ర జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9848809236 నెంబర్‌కు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

**అగ్రి ప్రాజెక్టుల ఏర్పాటుకు...**


రైతు ఉత్పత్తుల విలువ జోడింపు (అగ్రి ప్రాజెక్టులు) ద్వారా వ్యాపార యూనిట్ ఏర్పాటుపై సోమవారం నుంచి 12వ తేదీ వరకు కేవీకేలో శిక్షణ ఇవ్వనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 9885668592 నెంబర్‌కు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

### లింగాలలో 30.2 మి.మీ వర్షం



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతునే ఉన్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున జిల్లాలోని లింగాలలో అత్యధికంగా 30.2 మి.మీ వర్షం నమోదయింది. అలాగే పులివెందుల్లో 26, కొండాపురంలో 22.4, వేములలో 15 , వేంపల్లిలో 5.4 , సింహాద్రిపురంలో 4.4 , పెద్దముడియంలో 4.2, చక్రాయపేటలో 4, మైదుకూరులో 3.8, ఖాజీపేటలో 2.8, చాపాడులో 2.4, తొండూరులో 2.0, సిద్ధవటంలో 1.8 , దువ్వూరులో 1.6, బద్వేల్, అట్లూరులలో 1.4 , బి.మఠంలో 1.2, బి.కోడూరులో 1 మి.మీ వర్షం కురిసింది

### బాస్కెట్‌బాల్ అభివృద్ధికి కృషి



చామా శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: జిల్లాలో బాస్కెట్‌బాల్ అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చామా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరంలోని జయనగర్‌కాలనీ బాలికల ఉన్నత పాఠశాల బాస్కెట్‌బాల్ మైదానంలో ఇటీవల వ్యాయామ ఉపాధ్యాయుడుగా ఉద్యోగ విరమణ చేసిన చామా శ్రీనివాసరెడ్డిని బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చెమ్మమియాపేట బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సాజిత్, మంజులత, సుబ్బమ్మలు మాట్లాడుతూ జిల్లాలో వ్యాయామవిద్యకు శ్రీనివాసరెడ్డి ఎన్నో సేవలందించారన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు.

### ఉత్సాహంగా ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ: కడప నగరం తెలుగుగంగకాలనీలో 30 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం క్యాంపులో కడప ట్రాఫిక్ కానిస్టేబుల్స్ శ్రీహరిరావు, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు ప్రమాద బీమా గురించి కేడెట్స్‌కు అవగాహన కల్పించారు. 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్. సూర్యనారాయణమూర్తి పలు సూచనలు చేశారు. క్యాంపు డిప్యూటీ కమాండెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ మహేష్, శివరాం, గంగాధర్, నాగరాజునాయక్, స్వామినాథ్, పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్‌కుమార్, సీఎల్ఎస్ రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

# ఖాకీ వనంలో కలుపుమొక్కలు!

'ఖాకీ' వనంలో తులసిమొక్కలతో పాటు కలుపు మొక్కలూ పెరుగుతున్నాయా..? దురుసు ప్రవర్తనతో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అర్థాన్నే మార్చేస్తున్నారా..? ఇటీవల జరిగిన సంఘటనలు చూస్తే అవుననే సమాధానమే వినిపిస్తోంది. కొందరు పనిలో ప్రతిభ చూపి అటు అధికారులు.. ఇటు ప్రజల మన్ననలందుకుంటుంటే.. ఇంకొందరు వ్యక్తిగత దురుసు ప్రవర్తనతో వ్యవస్థకే మచ్చ తీసుకొస్తున్నారు.

- వ్యక్తిగత దురుసు ప్రవర్తనతో కళంకం
- తాజాగా రిమ్స్‌లో ఎస్ఐ వీరంగం... ఆపై అడిషనల్ ఎస్పీ మధ్యస్థం
- దిగజారిన పోలీసు ప్రతిష్ట
- అక్రమార్కులకు అండగా ఉంటూ జేబులు నింపుకుంటున్న కొందరు ఖాకీలు

సాక్షి ప్రతినిధి, కడప: ఇటీవల కలకత్తా ఆర్ జీ కర్ వైద్యకళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యా,హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా ఆందోళనకు దారి తీసింది. దేవుడు తర్వాత దేవుడయిన డాక్టర్లకు రక్షణ ఇవ్వాలని సమాజం నినదించింది. మరి రక్షణ కల్పించాల్సిన ఆ రక్షక భటుల నుంచే రక్షణ లేకపోతే.. అవును.. శనివారం ఇదే జరిగింది.



» మొన్న.. పులివెందుల పూలఅంగళ్ల సర్కిల్‌లో ఇద్దరు ట్రాన్స్‌కో ఉద్యోగులపై అర్ధ రాత్రి ఎస్ఐ అనిల్‌కుమార్ దాడి చేశారు. జయమ్మ కాలనీలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే మరమ్మతులు చేసి వస్తున్నామని జూనియర్ లైన్‌మెన్లయిన గురురాజ్, షఫీ చెబుతున్నా విన్పించుకోకుండా 'మీలాంటోళ్ల వల్లే దొంగతనాలు తెరపైకి వస్తున్నా'యని కర్రపెత్తనం చేశారు. ఉదయాన్నే ట్రాన్స్‌కో యంత్రాంగం నిరవధిక నిరసనకు దిగేందుకు సమాయత్తమయ్యారు. ఈలోపు ఎస్ఐపై సత్వర చర్యలు తీసుకోవడంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు వెనక్కి తగ్గారు.

» నిన్న.. ఎస్ఐ జయరాముడు రాత్రి రిమ్స్ కళాశాలలోకి వెళ్లారు. వినాయక మండపం వద్ద మైకు ఏర్పాటు చేయడాన్ని అడ్డుకున్నారు. డెంటల్ విద్యార్థులతో గొడవపడి మండపం వద్ద ఏర్పాటు చేసుకున్న మైకుసెట్ పోలీసు జీపులో వేసుకున్నారు. అనుమతులున్నా ఎందుకు తీసుకెళ్తున్నారని అడ్డుకున్న డెంటల్ విద్యార్థులపై వీరంగం చేశారు. అంతటితో ఆగకుండా మెడికల్ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న మండపం వద్ద కెళ్లారు. అక్కడా అదే స్థాయిలో జూనియర్ డాక్టర్లుతో గొడవపడ్డారు. రెండు సెల్‌ఫోన్లు పగలగొట్టారు.

☛ ఇటీవల వెలుగులోకి వచ్చిన ఈ రెండు సంఘటనలే కాదు.. వెలుగులోకి రాని ఘటనలు అనేకం. కొంతమంది అధికారులు 'ఫ్రెండ్లీ పోలీసు'అనే పదానికి అర్థం లేకుండా వ్యవహరిస్తున్నారు. తల బిరుసుతనంతో కొందరు, అక్రమార్జన కోసం మరికొందరు, రాజకీయ పరపతి కోసం ఇంకొందరు వ్యవస్థకు మచ్చ తెస్తున్నారు. స్వీయ నియంత్రణ లేకపోవడం, 'ఖాకీలం మాకేమన్న' అహం.. ఈ రెండు కారణాలు పతనావస్థకు దారి తీయడానికి ప్రధానమని ప్రజాస్వామ్యవాదులు వాపోతున్నారు.

రిమ్స్ డెంటల్, మెడికల్ జూనియర్ డాక్టర్లకు ఈ చేదు అనుభవం ఎదురయ్యింది. వివరాల్లోకి వెళితే.. రిమ్స్ పరిధిలో వినాయక విగ్రహ మండపాన్ని పరిశీలించడానికి ఎస్ఐ జయరాముడు అక్కడికి వెళ్లారు. అక్కడ అభ్యంతరకర దృశ్యాలుంటే అడ్డుచెప్పి చర్యలు తీసుకోవడం తప్పేమీ కాదు. అలా కాకుండా మైకు పెట్టుకున్నారని గొడవలు సృష్టించాడు. ఇది ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. అన్ని అనుమతులున్నా, పైగా ఎలాంటి ఫిర్యాదు లేకపోయినా వారి వద్దకెళ్లి రచ్చ పెట్టుకోవడంపై జూడాలు ఆవేదన చెందుతున్నారు.

**భయపెట్టి సర్దుబాటు చేస్తారా!**

రిమ్స్ ఎస్ఐ జయరాముడు వ్యవహారంపై ఏఎస్పీ వెంకటరాముడు దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో సక్సెస్ అయ్యారు. అంతవరకూ బాగానే ఉంది. దిగజారిన పోలీసు ప్రతిష్ట కాపాడడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. డెంటల్ కళాశాలలో ఓ విద్యార్థి వద్ద డ్రగ్స్ పట్టుబడ్డాయని కేసు పెడతామని బెదిరించి, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకుండా జాగ్రత్త పడ్డారు. అదేస్థాయిలో డ్యూటీలో ఉన్న ఎస్ఐ జయరాముడి విధులకు ఆటంకం కల్గించారని కేసులు పెడతామని హెచ్చరించి జూనియర్ డాక్టర్లు ఫిర్యాదు ఉపసంహరణ చేసుకోవడంలో ఏఎస్పీ కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. జూనియర్ డాక్టర్ల మనోస్థైర్యం దెబ్బతీసి, ఎస్ఐని రక్షించుకోవాలనే దిశగా అడుగులు వేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సమర్థవంత అధికారిగా గుర్తింపు ఉంది. ఆయనకు బాసటగా సిబ్బంది నిలిస్తే పోలీసు ప్రతిష్ట మరింత పెరుగుతోంది. కాగా కొంతమంది అధికారులు ప్రకృతి సంపదను ఆసరాగా చేసుకొని అక్రమార్జనలో మునిగి తేలుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి. కడప

**కలుపు మొక్కల్ని కట్టడి చేయలేరా ..**

సబ్ డివిజన్ పరిధిలో ఓ ఎస్ఐ వారానికి ఒక ట్రాక్టర్‌కు రూ.15వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకొని పాపాఘ్ని నదిలో ఇసుకాసురులను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. హిమకుంట్ల సమీపంలో అగంతకుల ఫోన్ ఫిర్యాదుతో పట్టుబడ్డ రేషన్ లారీని తప్పించి, ఆ స్థానంలో ఆటోను చేర్చి చేతులు దులుపుకోవడంలో పెద్దఎత్తున నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది. అలాగే వేముల పీఎస్ పరిధిలో పెండ్లూరుకు చెందిన మహేశ్వరరెడ్డిని అటకాయించి, వాహనాన్ని వెంబడించారు. ప్రత్యర్థుల పథకాన్ని పసిగట్టిన మహేశ్వరరెడ్డి కారులో చాకచక్యంగా తప్పించుకున్నారు. బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అయితే కౌంటర్ కేసులో బాధితుని సమీప బంధువులను 17మంది చేర్చడం గమనార్హం. ఇలాంటి చర్యలు క్రమం తప్పకుండా తెరపైకి వస్తున్నాయి. కేవలం ఖాకీ వనంలోని కొందరి కలుపు మొక్కల వల్లే ఇలాంటివి ఉత్పన్నమవుతున్నాయి. వీరిని కట్టడి చేస్తే పోలీసు ప్రతిష్ట మరింతగా పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి పోలీస్ బాస్ ఆ దిశగా చర్యలు చేపడతారో లేదో చూడాలి.

## శాస్త్రోక్తంగా బాలాలయ ప్రతిష్ట



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవాలయంలో ఆదివారం బాలాలయ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాలు ఆదివాం ముగిశాయి. ఇందులో భాగంగా వేదపండితుడు రాజేష్ బట్టర్, అర్చకులు కలిసి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మహా పూర్ణాహుతి, బాలాలయ చిత్రపట శాంతి ప్రోక్షణ జరిపారు. సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను బాలాలయ దర్శనానికి అనుమతించారు.

**కనీస ఏర్పాట్లు కరువు**

బలాలయంలో టీటీడీ అధికారులు భక్తుల సౌకర్యార్థం కనీస ఏర్పాట్లు చేయలేదు. కేవలం తాత్కాలిక పైపుల షామియానా వేశారు. వర్షం , గాలులకు పైపుల షామియానా వాలిపోయిందని , దీంతో తడుస్తూనే దర్శనానికి వెళ్లాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థిరమైన క్యూలైన్‌తో పాటు ఎండకు, వానకు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయం గురించి సివిల్ డిపార్ట్‌మెంట్ డీఈ నాగరాజుతో మాట్లాడగా సోమవారం నుంచి స్థిరమైన క్యూలైన్లు ఏర్పా చేస్తామని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు.



వానలో తడుస్తూ దర్శనానికి వెళుతున్న భక్తులు

# ఇసుక సరఫరా సజావుగా జరగాలి

**కలెక్టర్ శివశంకర్ లోతేటి**

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని ఇసుక రీచులలో ఇసుక సరఫరాను ప్రభుత్వ తాజా నిబంధనలకు అనుగుణంగా సజావుగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఇసుక పంపిణీ, రవాణా, వినియోగదారుల సంతృప్తి తదితర అంశాలపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా, కమిషనర్ – డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ శివ శంకర్ లోతేటి, ఇతర అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా, కమిషనర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీన ఆన్‌లైన్ సాండ్ పోర్టల్ ప్రారంభిస్తామని.. అందుకు సంబంధించి ఆయా ఇసుక స్టాక్ యార్డుల వద్ద సంబంధిత అధికారులను ఉంచాలని వారికి ఆన్‌లైన్ పోర్టల్‌పై జిల్లా ఉపాధి అధికారి, డిప్యూటీ తహసీల్దార్, ఈఓ పీఆర్డీలచే శిక్షణ ఇవ్వాలన్నారు. ఇసుక రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇన్‌ఛార్జి జిల్లా మైన్స్ అధికారి విమలమ్మ, డీటీసీ మీరా ప్రసాద్, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డిపిఓ ప్రభాకర్ రెడ్డి, నీటి పారుదల శాఖ ఎస్ఈ వెంకట్రామయ్య, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

# వరాలందించే ఆరోగ్యమాత

- బిషప్ గాలి బాలి
- ముగిసిన ఆరోగ్యమాత ఉత్సవాలు

కడప కల్చరల్: విశ్వసించిన వారికి ఆరోగ్యమాత వరాలు, దీవెనలు అందించి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని అందజేస్తుందని కడప మేత్రాసన అపోస్తలిక పాలనాధికారి బిషప్ డాక్టర్ గాలిబాలి అన్నారు. కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవదిన పూజ ప్రార్థన దినోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగరంలో ఆరోగ్యమాత ఉండడం రాయలసీమ ప్రాంతానికి ఆశీర్వాదకరమని, పది రోజులుగా ఆరోగ్యమాత నవదిన పూజా ప్రార్థనలు వైభవంగా జరిగాయన్నారు. కార్యక్రమంలో మేత్రాసన వికర్ జనరల్ రెవరెండ్ ఫాదర్ తలారి బాలరాజు, కోశాధికారి ఫాదర్ సంబటూరు సురేష్, పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ప్రసాద్‌రావు మేత్రాసన గురువులతో కలిసి విశ్వాసులకు ఆరోగ్యమాత సందేశాన్ని అందజేశారు.





ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు, ఆరోగ్యమాత సందేశం ఇస్తున్న బిషప్ గాలి బాలి


**మరియాపురంలో..**

స్థానిక మరియాపురం చర్చి వద్ద నుంచి ఆదివారం దివ్యబలిపూజ అనంతరం అలంకరించిన పల్లకీలో మరియమాత స్వరూపాన్ని ఊరేగింపుగా ఆరోగ్యమాత చర్చికి తీసుకువచ్చారు. తొలుత ఫాదర్ బాలరాజు, మరియన్నలు పెద్ద చర్చిలో దివ్య బలిపూజ సమర్పించారు. నగరంలోని ప్రముఖ కూడళ్ల మీదుగా ఊరేగింపు సాగింది. రంగురంగుల విద్యుద్దీపాలు, పూల అలంకరణతో ఊరేగింపు వైభవంగా సాగింది. వల్లూరు విచారణ గురువులు ఫాదర్ కారు శరత్, సిద్దవటం గురువులు ఫాదర్ జాన్, ఆరోగ్యమాత, యువత మేత్రాసన గురువులు, కన్య స్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

**తిరునాల సందడి**

శని, ఆదివారాల్లో ఆరోగ్యమాత ఉత్సవాల్లో భాగంగా ఘనంగా తిరునాలను నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన విశ్వాసులు ప్రత్యేక వాహనాల్లో ఈ ఉత్సవాలకు తరలివచ్చారు.

# వాతాపి గణపతిం భజే..



కడప : భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఆర్పీఎస్ఆర్ నగర్ గణపతి

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- ఊరంతా సందడి
- తిరునాలను తలపించిన భక్తజనం


కడప కల్చరల్: ఆది పూజల దేవుడు, శివపార్వతుల ముద్దుల తనయుడు గణనాథుడికి శని, ఆదివారాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాలుగల పందిళ్లన్నీ ఉదయం, సాయంత్రం భక్తజనంతో పోటెత్తాయి. తొలుత ముహూర్తం ప్రకారం గణనాథుని విగ్రహాలకు నేత్రోన్మీలనం చేసి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు.

● కడప నగరంలో భారీగా నిర్మించిన చిన్నచౌకు, ఎన్జీఓ కాలనీ, రాజీవ్‌మార్గ్‌లలోని పందిళ్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. పిల్లలు, పెద్దలు నిలువెత్తు గణపతి మూర్తులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి చిన్నారుల సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పౌరాణిక, భక్తి నాటక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భజనలు నిర్వహించారు.

**మట్టి గణపతి మనసా స్మరామి:** వినాయక చవితి నాడు మట్టి విగ్రహాలకే పూజలు చేయాలని పెద్దలు చేసిన ప్రచారం మంచి ఫలితమే ఇచ్చింది. మార్కెట్‌లో మట్టి విగ్రహాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రసార మాధ్యమాలు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పలుచోట్ల చిన్నసైజు మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు.

**బారులు తీరి..**

కడప నగరం రాజీవ్‌మార్గ్, ఎన్జీఓ కాలనీ, చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయం వద్దగల పందిరిలో భారీ విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తజనం గంటలకొద్ది బారులు తీరారు. రాజీవ్ మార్గ్‌కు ఇరువైపుల రోడ్లు జనంతో నిండిపోయాయి. రోడ్లకు ఇరువైపుల దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం తిరునాలను తలపించింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నగరంలోనే పెద్ద సైజు వినాయక విగ్రహం గనుక పందిరిలోపల రాజసౌధాలను తలపించేలా ఏర్పాటు చేసిన అలంకరణను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో వీధులన్నీ జనమయమయ్యాయి.



కడప రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన మహాగణపతి



కడప రాజీవ్‌మార్గ్‌లో మహాగణపతి దర్శనానికి బారులు తీరిన భక్తులు



కమలాపురం: వినాయకుని విగ్రహ నిమజ్జనం ఊరేగింపులో యువత చిందులు



ప్రొద్దుటూరు: తాళ్లమాపురంలో కాణిపాక గణపతి



ప్రొద్దుటూరు శివాలయంలో చతుర్ముఖ శ్వేత గణపతి



కడపలో గణపతి మండపానికి పండ్లతో అలంకరణ

## క్లుప్తంగా

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా విజయజ్యోతి



కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన కమిటీని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమించింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా విజయ జ్యోతిని, కడప నగర అధ్యక్షుడిగా అఫ్జల్ ఖాన్‌ను, అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అలీఖాన్‌ను నియమించారు. పార్టీలో ఎన్నో ఏళ్లుగా ఉన్న వారికి డీసీసీ, నగర అధ్యక్ష పదవులు ఇవ్వకపోవడంపై సీనియర్ నాయకులు కాంగ్రెస్ అధిష్టానంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు ఇతర పార్టీలలో చేరారు.

### పెన్నాలోకి కృష్ణా జలాలు



పెన్నా నదిలోకి వస్తున్న కృష్ణా జలాలు

జమ్మలమడుగు : గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయంలోనికి కృష్ణా జలాలను విడుదల చేశారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో ఐదు టీఎంసీల నీరు చేరుకుంది. పెన్నానది పరివాహక ప్రాంతాల ప్రజలకు తాగునీటి అవసరాల కోసం, వ్యవసాయ బోర్లలో నీరు పెంచడం కోసం అధికారులు మైలవరం జలాశయం నుంచి రోజుకు ఐదువందల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వారం రోజుల నుంచి మూడువేల క్యూసెక్కుల నీరు పెన్నానదిలో ప్రవహించింది. ఏడాదిగా ఎడారిని తలపించిన పెన్నానదిలో నీరు చేరడంతో ప్రజలు పెన్నానదిలో దిగి కృష్ణా జలాలకు పూజలు నిర్వహిస్తున్నారు. 2021లో భారీ స్థాయిలో పెన్నా నదిలో నీరు ప్రవహించింది. మూడు సంవత్సరాల తర్వాత పెన్నానదిలో నీటి ప్రవాహం సాగుతోంది.

### కారు ఎత్తుకెళ్లారు



చోరీకి గురైన కారు ఇదే

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె పంచాయతీ లింగాలదిన్నెపల్లె గ్రామానికి చెందిన కరెంట్ నరసింహారెడ్డి పెద్ద కుమారుడు ఎల్.భాస్కర్‌రెడ్డికి చెందిన కారును ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు మాట్లాడుతూ తాను బాడుగలకు వెళ్లేందుకు రెండు కార్లు తెచ్చుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లేందుకు కారును శుభ్రం చేసుకుందామని బయటికి వచ్చి చూడగా కారు లేదు. దీంతో బి.మఠం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### కాపర్ వైర్లు చోరీ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి పంచాయతీ, గురవయ్యగారిపల్లి సమీపంలో బోరు మోటార్లకు ఉన్న కేబుల్ వైర్‌లోని కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులు రమణ, సుబ్బమ్మలకు చెందిన బోరు మోటార్లకు ఉన్న కేబుల్ వైర్‌ను దొంగలు కట్ చేసి అందులో ఉండే కాపర్ వైర్‌ను తీసుకెళ్లారు.

# జగనన్న కాలనీ లే అవుట్ల తొలగింపు



తొలగించిన బేస్ మట్టం



పొక్లెయిన్ ద్వారా లే అవుట్‌లను తొలగిస్తున్న దృశ్యం

**న్యాయం చేయాలంటూ బాధితుల నిరసన**

జమ్మలమడుగు/జమ్మలమడుగు రూరల్ : ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. అందులో భాగంగా మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి వాసులకు అంబవరం సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు కేటాయిస్తామని ప్రభుత్వాధికారులు సూచించారు. అయితే బొమ్మెపల్లి వాసులు మాత్రం తమకు గ్రామానికి సమీపంలో గండికోట రహదారిలో ఇంటి పట్టాలు ఇవ్వాలని పట్టుబట్టారు.

దీంతో అప్పటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఒప్పించి వారికి రెండున్నర ఎకరాలలో ఇంటిపట్టాల కోసం స్థలాన్ని కేటాయించి అందులో లే అవుట్‌లు వేశారు. గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలకు దాదాపు 140 మందికి ఇంటి పట్టాలను ఇచ్చారు. ప్రభుత్వం మారిపోవడంతో ఎన్‌డీఏ కూటమికి చెందిన నాయకులు ఈ స్థలాలలో వేసిన లే అవుట్‌లను పూర్తిగా తొలగించారు. అంతే కాకుండా ఇళ్ల నిర్మాణం కోసం చేపట్టిన బేస్‌మట్టాలను పొక్లెయిన్ పెట్టి మరీ కూలదోశారు. దీంతో బాధితులు పోలీసు స్టేషన్ వద్దకు వచ్చి తమకు న్యాయం చేయాలని, లే అవుట్‌లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బేస్‌మట్టం పడగొట్టారు**



గత ప్రభుత్వంలో మాకు ఇళ్ల స్థలం కేటాయించారు. దీంతో ఆ ప్రాంతంలో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు బేస్ మట్టం వేశాము. త్వరలో ఇంటి నిర్మాణం చేపట్టాలని డబ్బులు సర్దుబాటు చేసుకుంటున్నాము. ఇప్పుడు టీడీపీ నాయకులు వచ్చి ఈ స్థలాలు మావి అంటూ బేస్ మట్టాలను పొక్లెయిన్‌తో పడగొట్టారు.

పెద్దబాలి వెంకట లక్ష్మీదేవి, పి.బొమ్మెపల్లి, బాధితురాలు

**ఐదుగురు వచ్చి తొలగించారు**



ప్రభుత్వం మాకు ఇచ్చిన ఇంటి పట్టాలలో వేసుకున్న బేస్ మట్టాలను టీడీపీ నాయకులు తొలగించారు. దాదాపు రూ.70వేలకు పైగా ఖర్చు పెట్టి బేస్‌మట్టం నిర్మించుకున్నాం. టీడీపీ నాయకులు గోపాల్ , రామమోహన్, రాజారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అనే వారు దగ్గరుండి పొక్లెయిన్‌తో బేస్‌మట్టాలు నేలమట్టం చేశారు.

దేవి, బాధితురాలు, పి.బొమ్మెపల్లి

**బాధితులకు న్యాయం చేస్తాం**

పి.బొమ్మెపల్లి గ్రామంలో బేస్ మట్టాలను తొలగించారని ఫిర్యాదు చేసిన వారికి తప్పకుండా న్యాయం చేస్తాం. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఎంత మందికి పట్టాలు ఇచ్చారు అనే విషయాన్ని తెలుసుకున్న తర్వాత నిజమైన లబ్ధిదారులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

లింగప్ప, అర్బన్ సీఐ, జమ్మలమడుగు

# పథకం ప్రకారమే మహేశ్వరరెడ్డిపై దాడి

- దాడి ఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేయని పోలీసులు
- ఇరువర్గాలపై కేసు నమోదు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వేముల మండలం పెండ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేళ్ల మహేశ్వరరెడ్డిపై పథకం ప్రకారం టీడీపీ వర్గీయులు దాడి చేసినట్లు స్పష్టమవుతోంది. మహేశ్వరరెడ్డి స్వగ్రామం నుంచి శుక్రవారం రాత్రి పులివెందుల వెళ్తుండగా టీడీపీ వర్గీయులు కాపు కాసి కర్రలతో దాడి చేసి కారు అద్దాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయకుండా పోలీసులు వ్యవహరించారని బాధితుడు ఆరోపించాడు. దుండగుల నుంచి త్రుటిలో తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పిందని లేదంటే తనను చంపేసే వారని పేర్కొన్నాడు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారమే గ్రామం పొలిమేరలో కాపు కాసి గ్రామం నుంచి బయలు దేరిన సమాచారం అందుకుని అప్రమత్తమైన టీడీపీ వర్గీయులు దారిలో వాహనాలు అడ్డు పెట్టి రాడ్లు, కర్రలతో దాడి చేసి కారు అద్దాలను ధ్వంసం చేశారని బాధితుడు వాపోయాడు. ప్రత్యర్థులు దాడి చేయడంతో వాహనాన్ని వేగంగా నడిపి దారి నుంచి తప్పించుకుని పెర్నపాడు గ్రామానికి చేరుకున్నానని తెలిపాడు. తనపై హత్యాయత్నం జరిగినా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు కేసు నీరు గార్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

**ఇరువర్గాలపై కేసు నమోదు**

పెండ్లూరు గ్రామానికి చెందిన నాగేళ్ల మహేశ్వరరెడ్డిపై హత్యాయత్నం కేసుకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కారు అద్దాలు ధ్వంసం అయిన ఘటనకు సంబంధించి నాగేళ్ల మహేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు చంద్రవర్ధనరెడ్డి, చంద్రసేనారెడ్డి, సుగుణాకరరెడ్డిలతో పాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు. అలాగే గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తన ఇంటిపై దాడి చేశారని టీడీపీ నాయకుడు అంకిరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు మహేశ్వరరెడ్డి, సహదేవరెడ్డి, వంశీధరరెడ్డిలతో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# కడప రిమ్స్‌లో ఆందోళన

- డీజేలను ఆపివేయాలన్న పోలీసులు
- పోలీసులతో వాగ్వాదానికి దిగి ఆందోళనకు దిగిన వైద్య విద్యార్థులు
- అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ ఆవరణంలో ఉన్న ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఆవరణంలో వినాయకచవితి సందర్భంగా శనివారం రాత్రి వైద్య విద్యార్థులకు, రిమ్స్ పోలీసులకు వాగ్వాదం జరిగి చివరకు ఆందోళనకు దారితీసింది. పోలీసుల అనుమతితోనే తాము వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని డీజేలు పెట్టుకున్నామని, పోలీసులు వచ్చిరావడంతోనే తమను అడ్డుకున్నారని వైద్య విద్యార్థులు ఆరోపించారు. తమను ఎస్ఐ దుర్భాషలాడారని అతనిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద వైద్య విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారు. ఆదివారం పోలీసులను, వైద్య విద్యార్థులను, వారి అధికారులను ఇన్‌చార్జి డీఎస్పీ, అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు కడప డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి ఇరువైపుల వారిని విచారించారు. కౌన్సిలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని చెప్పి పంపించేశారు.

# వినాయక మండపంలో ప్రమాదం

**విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి**



చరణ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని రామేశ్వరంలో పండుగ పూట విషాదం చోటు చేసుకుంది. వినాయక మండపంలో విద్యుత్ షాక్ తగిలి ఉండేల చరణ్‌కుమార్‌రెడ్డి (24) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రామేశ్వరంలోని రెడ్డిగారివీధిలో ఆ ప్రాంత యువకులందరూ కలిసి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శనివారం నుంచి వినాయక మండపం వద్ద భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం పట్టణంలో పెద్ద ఎత్తున ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో మండపంలో ఉన్న చరణ్‌కుమార్‌రెడ్డికి విద్యుత్ షాక్ తగలడంతో అతను కింద పడిపోయాడు. దీంతో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపేసి చరణ్‌కుమార్‌రెడ్డిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యుడు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపాడు. చరణ్‌కుమార్‌రెడ్డి తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి చెనక్కాయల మిల్లులో పని చేస్తుంటాడు. ఆయనకు చరణ్‌కుమార్‌రెడ్డితో పాటు సతీష్‌రెడ్డి అనే మరో కుమారుడు ఉన్నారు. పండుగ వేళ సంతోషంగా ఉండాల్సిన ఆ ఇంట విషాదం చోటు చేసుకుంది. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లి వసంత తల్లడిల్లిపోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

**రాయచోటిలో..**

రాయచోటి టౌన్ : వినాయకుడిని ప్రతిష్టించేందుకు ఏర్పాటు చేస్తున్న మంటపంలో విద్యుత్ షాక్‌తో మహేష్ (13) అనే బాలుడు మృతి చెందాడు. అర్బన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారు జామున రాయచోటి పట్టణ పరిధిలో చిత్తూరు రోడ్డులోని టీవీఎస్ షోరూం వెనుక భాగాన స్థానికులు వినాయకుడి మంటపాన్ని నిర్మిస్తున్నారు. ఈ మంటపం నిర్మాణంలో భాగంగా విద్యుత్ వైరు లాగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. బాలుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కృష్ణా జలాల పంపిణీలో రాయలసీమకు న్యాయం చేయాలి

కడప రూరల్ : కృష్ణా జలాల పంపిణీలో ప్రకాశం, నెల్లూరుతోపాటు రాయలసీమ జిల్లాలకు న్యాయం చేయాలని అఖిలపక్ష నేతలు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో కృష్ణా జలాల పునఃపంపిణీ–కరువుప్రాంతాలపై ప్రభావం అనే అంశంపై బి.నారాయణ అధ్యక్షతన అఖిలపక్ష నేతలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల పంపిణీలో ప్రకాశం, నెల్లూరుతోపాటు రాయలసీమకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయమై చంద్రబాబు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి ఏపీకి రావాల్సిన నికర జలాలను తీసుకు రాకపోవడం దుర్మార్గమని విమర్శించారు. సీఆర్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ ప్రాంతం సాగు, తాగునీటి జలాల కోసం పోరాటాలు సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు ఆంజనేయులు, వేణుగోపాల్, దేవర శ్రీకృష్ణ, భూసిపాటి కిశోర్, రాజేంద్ర, జయవర్ధన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విషాదం మిగిల్చిన ప్రయాణం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



దత్తాపురం రమణ (ఫైల్)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దత్తాపురం రమణ



సుంకేసుల సుభాన్ (ఫైల్)



ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందిన సుకేసుల సుభాన్

సిద్దవటం : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. కడప–చెన్నై ప్రధాన రహదారిలోని వాసవీ కళాశాల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాలాబాదుకు చెందిన ఆటో డ్రైవర్ సుంకేసుల సుభాన్ ప్రయాణికులను తీసుకొని కడపకు బయలు దేరారు. కడప నుంచి ఒంటిమిట్ట వైపు కారు వెళుతోంది. సిద్దవటం మండలంలోని వాసవీ కళాశాల సమీపంలోకి రాగానే కారు గేదెను ఢీకొంది. దీంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో గేదెతో సహా ఒంటిమిట్ట మండలం మృకుండాశ్రమానికి చెందిన దత్తాపురం రమణ(35)అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఆటోడ్రైవర్ సుంకేసుల సుభాన్ (21) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె గ్రామానికి చెందిన నూర్జహాన్‌తో మూడు నెలల క్రితం వివాహమైంది. మృతుడు రమణతో పాటు గాయపడిన అతని కుమారుడు సాయి మధుసూదన్, బావ మరిది ఇరువురు వెంకటరమణ కడపలో ఓ క్లాత్ రశాలలో పనిచేస్తున్నారు. ఆదివారం గిరాకీ ఎక్కువగా ఉంటుందని వారు తెల్లవారు జామునే ఆటోలో కడపకు బయలు దేరారు. ప్రమాదంలో రమణ అక్కడికక్కడే మృతి చెందగా, వీరు తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు మాధవరానికి చెందిన రాజశేఖర్‌కు గాయాలయ్యాయి. అలాగే గోపవరం మండలం బేదయిపాశెం గ్రామానికి చెందిన ఓబులం వెంకటసుబ్బయ్య ఇబ్రహీంపేటలో తన బంధువుల వద్దకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ఇదే ఆటోలో వెళ్తుండగా ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యుల సూచన మేరకు సాయి మధుసూధన్, ఇరువురు వెంకటరమణ, ఓబులం వెంకటసుబ్బయ్యలను తిరుపతికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**ట్రాక్టర్–బైక్ ఢీ**



దిలీప్(ఫైల్)

పెద్దముడియం : జమ్మలమడుగు–పెద్దపసుపుల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపసుపుల గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ (23) మృతి చెందాడు. పెద్దపసుపుల గ్రామానికి చెందిన శామ్యూల్, బుజ్జి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమారుడు దిలీప్ కుమార్ కడపలో ఉద్యోగం చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల మీద ఇంటికి వచ్చిన అతను తిరిగి శనివారం కడపకు బయలుదేరాడు. జమ్మలమడుగుకు 3 కిలోమీటర్ల దూరంలో ట్రాక్టర్–బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో దిలీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు వెంటనే 108 వాహనానికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా ప్రమాద స్థలానికి రాలేదు. దీంతో దాదాపు గంట తరువాత ఆటోలో జమ్మలమడుగుకు తీసుకెళ్లారు. అప్పటికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


**ట్రాక్టర్ ఢీకొని..**



వెంకటేశ్వర్లు (ఫైల్)

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపవరం మండలం కాలువపల్లె పంచాయతీ గొల్లపల్లె గ్రామానికి చెందిన బైరారపు వెంకటేశ్వర్లు (39) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు భార్య స్వప్నతో పాటు ఆరుగురు పిల్లలు ఉన్నారు. గొల్లపల్లె దళితవాడలో జరగనున్న వినాయకచవితి ఉత్సవాలకు విగ్రహం కొనుగోలు చేసేందుకు గ్రామస్తులతో పాటు శుక్రవారం రాత్రి పట్టణానికి వచ్చిన వెంకటేశ్వర్లు తిరిగి గ్రామానికి వెళుతున్న సమయంలో బైపాస్‌రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా విగ్రహం కొనుగోలుకు వెళ్లి వెంకటేశ్వర్లు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ఎదురెదురుగా మోటారు బైకులు ఢీకొని..**



మృతి చెందిన షేక్ షారిక్

వల్లూరు : కడప– తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప నగరానికి చెందిన షేక్ షారిక్ (13) అనే బాలుడు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు కడప అల్మాస్ పేటకు చెందిన షేక్ షారిక్, మహమ్మద్ అమాన్, షాబాద్ అనే ముగ్గురు బాలురు స్నేహితులు. వీరు శనివారం సాయంత్రం సరదాగా మోటార్ బైక్‌లో కమలాపురం వచ్చారు. తిరిగి కడపకు వెళ్లే క్రమంలో సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో మోటారు బైక్‌ను ఢీకొట్టారు. దీంతో వారిలో షేక్ షారిక్ అనే బాలుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ద్విచక్రవాహనంలో ఉన్న మహమ్మద్ అమాన్, షాబాద్‌లతో బాటు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనంలోని పెద్దచెప్పలికి చెందిన వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిని ముగ్గురిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతి చెందిన షేక్ షారిక్ కడపలోని ఓ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నట్లు తెలిసింది.

### కడప, నెల్లూరు జట్లు విజయం



5 వికెట్లు తీసిన కడప బౌలర్ అస్లాం



5 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ సుతేజ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 146 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంత జట్టు 57.1 ఓవర్లలో 239 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మహేంద్రారెడ్డి 43 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు సుతేజ్‌రెడ్డి 5, సుబ్రమణ్యం 3 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 48 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 133 పరుగులు చేయగా, అనంత జట్టు 235 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 383 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

**కడప జట్టుకు విజయం..**

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 165 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 59.4 ఓవర్లలో 257 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 63 ఓవర్లలో 202 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కడప బౌలర్లు అస్లాం 5 వికెట్లు తీశాడు. దీంతో కడప జట్టు 44 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 223 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 234 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

### టెంపో ఢీకొని రైతు దుర్మరణం

మదనపల్లె : వేంపల్లెకు చెందిన రామ్మోహన్(45) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా, మార్గమధ్యంలో చిప్పిలి వద్ద టెంపో ఢీకొంది. దీంతో అక్కడికక్కడే రామ్మోహన్ మృతి చెందాడు. తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

### ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : మామిళ్లవారిపల్లెకు చెందిన తాతయ్య కుమారుడు రెడ్డెప్ప(45) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో గుర్రంకొండకు వస్తుండగా, చెరువు కట్ట సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫార్సు చేశారు. గుర్రంకొండ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### శాస్త్రీయ దృక్పథం విస్తరించాలి



మాట్లాడుతున్న వైవీయూ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి

కడప కల్చరల్ : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని మరింతగా పెంచేందుకు కార్యాచరణ చేపట్టాలని వైవీయూ ప్రొఫెసర్, జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీలో జన విజ్ఞాన వేదిక జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించగా, జేవీవీ జెండాను పూర్వ కార్యదర్శి రఘునాథరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సైన్స్ పురోభివృద్ధిని కాంక్షించేవారు శాస్త్రీయంగా అనేక విషయాలను అర్థం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. మూఢ నమ్మకాలను విడనాడాలని సూచించారు. ప్రకృతి వినాశనం మానవ మనుగడకు, జీవరాసులకు నష్టమని హెచ్చరించారు. జేవీవీ నాయకులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధాల్లో పై చేయి సాధించేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని తెలిపారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న, దేవదత్తం, శివరాం, వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు

- ఆదివారం ఎస్పీ బంగళా వద్ద కూలిపోయిన అనుమతి లేని హోర్డింగ్
- సెలవుదినం కావడంతో తప్పిన పెను ప్రమాదం



ఎస్పీ బంగళా వద్ద పడిపోయిన హోర్డింగ్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన నగరపాలక టౌన్‌ప్లానింగ్ విభాగం చేష్టలుడిగి చూస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి పేరుమీద వేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులైనా 3 రోజుల వరకే ఉంచాలని, ఆ తర్వాత తొలగించాలని నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. అప్పటి కమిషనర్ ఆ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేస్తూ వచ్చారు. ఉప ముఖ్యమంత్రి, మేయర్, మంత్రుల పేర్లతో వేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలను సైతం మూడు రోజుల తర్వాత కార్పొరేషన్ సిబ్బంది తొలగించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరపాలక సంస్థ అనుమతి లేకుండా టీడీపీ, జనసేన నాయకులు ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు కట్టేస్తున్నారు. వీటిని తొలగించడానికి వెళ్తున్న నగరపాలక టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తుండటంతో వారు మిన్నకుండిపోతున్నారు. ఇటీవలే ఆగస్టు నెలలో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ నేతలు నగరంలో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. వాటిని ఇప్పటివరకూ తొలగించలేదు. అంతలోనే ఈనెల 8వ తేదీ ఆదివారం టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఆర్. శ్రీనివాసులరెడ్డి పుట్టిన రోజు వచ్చింది. ఇంకేముంది టీడీపీ నేతలు, కార్యకర్తలు మరింత పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ప్రతి సర్కిల్ లోనూ నిలువెత్తు హోర్డింగులు ప్రతిష్టించారు. ఈ క్రమంలో ఎస్పీ బంగళా వద్ద ఏర్పాటు చేసిన నిలువెత్తు హోర్డింగ్ గాలికి కూలిపోయింది. పనిదినాల్లో అయితే నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో పెను ప్రమాదమే సంభవించి ఉండేది. అసలే ఆదివారం, అందులోనూ వినాయక చవితి పండుగ కావడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఒకవేళ ప్రమాదం జరిగి ఉంటే బాధ్యులెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనుమతి లేకుండా హోర్డింగ్ ఏర్పాటు చేసిన టీడీపీ నేతలదా...వాటిని తొలగించకుండా ఉన్న నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులదా... ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, కార్పొరేషన్‌కు చలానాలు కట్టకుండా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.